ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 05.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఈరోజు స్వాతంత్ర్య సమరయోధుడు , మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన సేవలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొనియాడారు.

2. తమ పార్టీ రాజ్యాంగాన్ని సంపూర్ణంగా నమ్మే పార్టీ అని , రాష్ట్ర BJP అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు.

3. నిర్మల్ జిల్లాలో 23.35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు ఈ రోజు శంకుస్థాపన చేశారు.

4. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే విధానాన్ని శాశ్వతంగా అమలు చేయడం వల్ల 400 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.

---

**వెంకటస్వామి జయంతి**

ఈరోజు కాకా జి. వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన సేవలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన వెంకటస్వామి పేద ప్రజల హృదయాల్లో దీపంలా వెలిగారని పేర్కొన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల జీవితాల్లో చెరగని ముద్ర వేయడంతో పాటు బడుగు , బలహీన వర్గాల సంక్షేమం, ప్రగతి కోసం ఆయన నిరంతరం కృషి చేశారని ముఖ్యమంత్రి కొనియాడారు.

డెస్క్

**వెంకటస్వామి మంత్రులు**

మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి  97వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మంత్రులు వివేక్ వెంకటస్వామి  , అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ ,ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్ , మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్ తదితర ముఖ్య నేతలు , అభిమానులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ... నీతికి కట్టుబడి పేదలు , బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి , తెలంగాణ సాధనకు కాకా అంకితభావంతో కృషి చేశారని కొనియాడారు. రాజకీయాల్లో కాకా వెంకటస్వామి మార్గదర్శకత్వం ఎంతో ఆదర్శనీయమని, ఆయన ఆశయ సాధనకు నిబద్ధతతో పనిచేయడమే కాకాకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

Desk

**రామచందర్‌రావు**

బీజేపీ రాజ్యాంగాన్ని సంపూర్ణంగా నమ్మే పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన సూత్రాలు , ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పార్టీ ముందుకెళ్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన మన దేశ ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నిరాధార ఆరోపణలు చేయడం సబబుకాదని  రాంచందర్ రావు అన్నారు.  కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు మంచివని , ఓడిపోతే ఈసీని తప్పుపట్టడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. తెలంగాణలో చొరబాటుదారుల ఓట్లను తొలగిస్తుంటే ఓటమి భయంతో 'ఇండి'  కూటమి విష ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని స్పష్టం చేసిన ఆయన.. అక్టోబర్  7న జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న 'సేవా జ్యోతి యాత్ర', 'వికసిత్ భారత్ సంకల్ప సభ 'లను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

PTC, HYD

**'నల్సా'**

హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల 'నల్సా' సౌత్ జోనల్ కాన్ఫరెన్స్ విజయవంతంగా ముగిసింది. సుప్రీం కోర్టు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరైన ఈ సదస్సులో డిజిటల్ ఆధారాలు , పిల్లల లైంగిక నేరాల నివారణ , డిజిటల్ బాల్య పరిరక్షణ అంశాలపై చర్చించారు. జస్టిస్ విక్రమ్ నాథ్ , జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తదితరులు ప్రసంగించగా, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ముద్రించిన పుస్తకాలను అతిథులు విడుదల చేశారు.

డెస్క్

**'చింతన్ శివిర్-2026'**

గుజరాత్‌లోని ఎక్తా నగర్‌లో జరుగుతున్న 'చింతన్ శివిర్- 2026' లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాల అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ప్రశంసిస్తూ, భవిష్యత్ అవసరాల దూరదృష్టితోనే జాతీయ రహదారులు , రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

డెస్క్

**శివ ప్రతాప్ శుక్లా**

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా రేపు మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. ఐడీఓసీ వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేక 'నషా ముక్త్ భారత్ ' ర్యాలీని ప్రారంభించి , విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు , రెడ్‌క్రాస్ ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం రామాయంపేటలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన 35 వేల జీడిమామిడి మొక్కల నాటే బృహత్తర కార్యక్రమాన్ని గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు.

డెస్క్

**ఐఐటీ హైదరాబాద్**

ఐఐటీ హైదరాబాద్‌లో 'గ్లోబల్ పొల్యూటెంట్' అంశంపై 17వ అంతర్జాతీయ పాదరస సదస్సు అక్టోబర్ 4 నుంచి 9 వరకు ఘనంగా జరుగుతోంది. భారతదేశంలో మొదటిసారి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 26 దేశాల శాస్త్రవేత్తలు , విధానకర్తలు హాజరయ్యారు. మీనామాటా ఒప్పందం 10 ఏళ్ల మైలురాయిపై దృష్టి సారిస్తూ పాదరస కాలుష్య నివారణ , మానవాళి ఆరోగ్యం , పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలపై సదస్సులో చర్చిస్తున్నారు.

డెస్క్

**డిప్యూటీ సీఎం భట్టి**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను హెచ్చరించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో... స్కూళ్ల ఆధునికీకరణ, బ్రిడ్జిల నిర్మాణాలను వేగవంతం చేయాలని, మెప్మా ద్వారా మధిరలో 10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ అందించాలని , భూ రీ-సర్వే పారదర్శకంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

డెస్క్

**కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నాయకులు భారీ ముట్టడి , ధర్నా చేపట్టడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డిపెండెంట్ ఉద్యోగాల కల్పన, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహణ, సంస్థ లాభాల్లో 35 శాతం బోనస్ చెల్లింపు , విజిలెన్స్ వేధింపులు నిలిపివేసి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. అధికారుల హామీతో ధర్నా విరమించారు. సమస్యల

పరిష్కారానికి రెండు నెలల సమయమిచ్చిన కవిత , నెరవేర్చకపోతే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

డెస్క్

**మంత్రులు – నిర్మల్**

నిర్మల్ జిల్లాలో 23.35 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా గోదావరి పుష్కరాల రహదారులు , రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు , ప్రభుత్వ సేవలు అందించేందుకు ఈ పనులను గడువులోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు.

పీటీసీ, నిర్మల్

**ఆర్వీ కర్ణన్**

కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మార్గాలను ఈ రోజు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటీ పనులను రద్దు చేసి వన్ వే విధానాన్ని శాశ్వతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల 400 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని చెప్పారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు 6 లైన్ల స్టీల్ బ్రిడ్జ్, అండర్ పాస్ నిర్మించి వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

డెస్క్

**రాంచందర్ రావు**

దేశంలో అక్రమంగా ఎన్నికలు జరుగుతున్నాయని , ప్రధాని మోదీ, అమిత్ షా చట్టవిరుద్ధంగా ఆ పదవుల్లో ఉన్నారంటూ ప్రభుత్వం రద్దు చేసి బ్యాలెట్ ద్వారా ఎన్నికలు పెట్టాలని మల్లికార్జున ఖార్గే చేసిన విమర్శల మీద ఎన్. రాంచందర్ రావు సోషల్ మీడియా ప్లాట్ ఫారం X వేదికగా స్పందించారు. అదే తర్కంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ మంత్రులు ,

ఎమ్మెల్యేలు కూడా అక్రమమే అవుతారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు తమ మాటలకు కట్టుబడి ఉంటే రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని ఆయన సవాలు విసిరారు.

డెస్క్

**ఇండియస్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు**

యాదాద్రి భువనగిరి జిల్లాలో తొలిసారిగా నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా 15 మంది విజయం సాధించారు. నిన్న మధ్యాహ్నం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిన్న రాత్రి వరకు కొనసాగింది.

పీటీసీ, యాదాద్రి భువనగిరి

**ఇండియస్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్**

ఆసిఫాబాద్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన చైర్మన్ గా కాగజ్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి అనిత ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ ఎంపిక కాగా నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు... ఎప్పటి నుండో రెడ్ క్రాస్ సొసైటీలో పనిచేస్తున్నామని సేవా భావంతో పనిచేస్తున్న సొసైటీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు.

పీటీసీ, ఆసిఫాబాద్

**యోగా శిక్షణ - ఆసిఫాబాద్**

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం ఉంటుందని ప్రధాని పిలుపుతో ప్రతి ఒక్కరు యోగాలో భాగస్వాములు కావాలని బిజెపి ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్ యాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో

నిర్వహించిన యోగా శిక్షణకు బిజెపి పట్టణ అధ్యక్షులు ఆకుల సంతోష్ కుమార్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని , నేటి బిజీ జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజు కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు.

పిటిసి, ఆసిఫాబాద్